


# నేను నేలలో... మా అమ్మ బెంచీలో

సాయింత్రం ఆరు గెంటలకు ముందే గబగబా వేణ్ణీళ్లు పెట్టుకునేసేసి, బిరబిరా స్నానం చేసేసిందంటే మా అమ్మ తొలాట సినిమాకి సైగ్గా ప్లానేసినట్టే లెఖ్ఖ!

అయిదు నిమిషాలకొక తడవ మా యిల్లుగల్లామైన జైబూన్ఆపాతో గుసగుసగా మాట్లాడతా ఉందంటే యీళ్లిద్దరూ కలిసి నూక్కోపోబోతా ఉన్నారని అర్దం.

అయితే - యిప్పుడు - యీళ్లిద్దరితోకలిసి- మనం సినిమాకి పోవడం ఎట్టా? - అనేది నా ప్రాబ్లము.

మా అమ్మా, జైబూన్ ఆపాలకు కూడా- యిప్పుడు- యీ నా కొడుకుని తప్పించుకొని

పోవడం ఎలా అనేది సమస్య.

ఎందుకంటే ఎప్పుడు యీళ్లిద్దరూ కలిసి సినిమాకి పోవాలన్నా నేనే అడ్డంకి పుల్ల. తొలాట టయానికి మా అన్న సాదారణంగా యింట్లో ఉండడు కాబట్టి వాడు తగులుకుంటాడనే బాదలేదు. మా చెల్లెలు, మా తమ్ముడు చిన్న పిలకాయలు కాబట్టి వాళ్లను కాపేసేదానికి మా నాయినమ్మ ఎట్టా ఉండనే వుంది. యింక మా నాయినమ్మంటరా? సచ్చి గీపెట్టినా సరే సినిమా తట్టు కన్నెత్తి కూడా చూడదు.

అదేందోగాని మా నాయినమ్మకి సినిమాలంటే బలే అసయ్యం. (అప్పటికీ ఒకసారి మా నాయినమ్మను బలవంతం చేసి అప్పుడెప్పుడో 'మేరీ మెహెబూబ్' హిందీ సినిమాకి పిలచక పోయినాడంట మా నాయిన. హాల్లో కూచున్నప్పటాల్నించి హీరో రాజేంద్రకుమార్‌ని చూసి 'యీడెవడో మీసాలు లేని ముండ నా కొడుకు సినిమాకి పిలచకొచ్చినావేమిరారే' అంటా మా నాయిన్ను తిట్టిపోసిందంట మా నాయినమ్మ).

కాబట్టి మిగిలేది నేను- పెద్దోళ్లల్లో చిన్నోణ్ణి, చిన్నోళ్లలో పెద్దోణ్ణి.

టైము ఆరయ్యేటప్పటికి ఏందో మామూలు పనున్నట్టుగా యాక్షను చేస్తా యింట్లోకి నచ్చింది మా అమ్మ. నేను నా రెండూ కళ్లతో చూస్తా ఉండగానే ట్రంకుపెట్టె కాడికెళ్లింది. పెట్టె తెరిచి, గుడ్డలన్నీ పైకి తీసి కిందున్న తెల్లదుప్పటిని సర్రన బయిటికి లాగింది.

చాలు. అదే కొండగుర్తు. సినిమా ప్రోగ్రాము ఖరారయ్యిందని చెప్పడానికి.

ఎందుకంటే మా అమ్మ తెల్లదుప్పటి చుట్టుకొని గోషా పాటించేది సినిమాలకి పోయేటప్పుడు మాత్రమే- అది కూడా మా నాయినమ్మకు బయపడి.

నేను పుట్టి బుద్దెరిగినప్పట్నించి మా అమ్మకు బురఖాలేదు. యింకొకరి బురఖా తొడుక్కోవడం కూడా నా కళ్లతో నేను చూళ్లేదు. అసలకి మా అమ్మ గోషా, పరదా అంటా ఎచ్చులకారీ ఖాందానీ మాటల్నే మాట్లాడేది కాదు. మా అమమ్మోళ్లింటికి వెళ్లాలన్నా, పాతశెట్టి అంగడికెళ్లి వొస్తువులు తేవాలన్నా ఎట్టా వుండేదో అట్టే బయలుదేరేది- కుచ్చిళ్లయినా సరిగా దోపుకోకుండా. కానీ సినిమాకెళ్లేటప్పుడు మాత్రం మా నాయినమ్మ నోటికి బెదిరి తల నుంచి పాదాల దాకా తెల్లటి దుప్పటి చుట్టుకునేది మా అమ్మ.

'సత్తెనాశినం రోజులొచ్చిపడి కదా ఒక సిగ్గూ ఒక శరమూ లాకుండా ఈ గుంపు యిట్టా తయారవతా ఉండేదా? మా రోజుల్లో గోషా లేకుండా చిటికెన వేలన్నా బయిటికి పెట్టేవాళ్లమా' అని నస పెట్టేసేది మా నాయినమ్మ- మా అమ్మ గోషా పాటించకపోతే.

మా నాయినమ్మ యిట్టాంటి మాటలు మాట్లాడినప్పుడల్లా ఆమెకు సరయిన మొగుడు

జైబూన్ ఆపే. మా అమ్మన్నా నయం. మరేద కోసమైనా దుప్పటి చుట్టుకునేది. జైబూన్‌ఆపా అది కూడాలా. తల మీద పయిటన్నా కప్పుకోకుండా బయలు దేరేది.

మా నాయినమ్మ నస విని 'మీ రోజుల్లో అంత గోషా ఏం పెట్టేవాళ్లు తల్లా?' అనేదామె, కొంచెం వేళాకోళంగా. ఎమ్మట్నే మా నాయినమ్మ ఫ్లాషుబ్యాకులోకి వెళ్లేది.

'నీకేమి తెలుసుమే జైబునా? నిన్న మొన్నటి పిల్లకాకివి. మా రోజుల్లో మొగుడికి పొగులు పూట ఎదురుపడి మాట్లాడినా విడిచిన లంజతో సమానం తెలుసునా? పరాయి మొగోడు మమ్మల్ని చూసే మాట దేవుడెరుగు... మేము ఒక్క పరాయి మొగోణ్ణన్నా చూసెరగే వాళ్ళమా? ఆఖరికి దర్జీలకు కొలత రైక పంపడానికి కూడా సిగ్గుపడి చచ్చి మా రైకలు మేమే కుట్టుకునే వాళ్లం' అనేది మా నాయినమ్మ.

ఆమెని కదిలిస్తే కుర్ర పిల్లప్పటి కతలన్నీ యిట్టాగే చెప్పద్దని మా అమ్మ కదిలించదు. ఎప్పటిలాగే గమ్మున దుప్పటి చుట్టుకొని రెడీ అయిపోయింది సినిమాకి.

జైబూన్ ఆపా వచ్చినాక, 'రే... రిష్కా తేబో గబాల్న' అనింది నా తట్టు చూస్తా.

'తేనుగా' అన్నాను తల అడ్డంగా ఊపతా.

'ఏందిరో చెప్తా ఉంటే. పో... రిష్కా పిలచక రాబో' అనింది జైబూన్ ఆపా కూడా.

'తెస్తే- నన్ను కూడా -పిలచక పోవాలీ- సినిమాకీ' అన్నాను దీర్ఘాలు పెట్టి సాగదీస్తా.

'సినిమాకా? ఖాజాపీర్ కోడలికి కాన్పయ్యింది నాయినా. చూసి రావడానికి పోతున్నాం. ఆడకి పిలకాయలు రాకూడదు' అనింది మా అమ్మ. (చూసినారా ఎంత పెద్ద అబద్ధమో!)

'నువు- యాడికిపోతున్నావో- నాకు తెలుసులేమ్మా' అని చిటికేసి, 'మరేదగా నన్ను సినిమాకి పిలచక పోకపోతే రిష్కా 'తేను' అని బెదిరించేశాను. దెబ్బకు మా అమ్మ దారికొచ్చేసింది.

'ఈ ఇబ్లీష్ బాడ్‌కవ్‌తో ఎట్టా సచ్చేదమ్మా. నా దెగ్గిర ఉండేది నాలుగు రూపాయలు. రెండు టికెట్టుకి. రెండు రిష్కాకి' అనింది.

'పోనీలే సర్తాజా. నేలకి పంపిద్దాం. డబ్బులు నేనిస్తాలే' అనింది జైబూన్‌ఆపా- అంటే అప్పటికి ప్రతీసారీ నన్ను బెంచీకి పంపిస్తున్నట్టు.

'సరే పా నా కొడకా. ఇంటర్‌బెల్లులో పులిబంగరాలు అడిగినావో అప్పుడు చెప్తా నీ పని' అని పళ్లు పటపటమని కొరికింది మా అమ్మ.

ఆమె ఆ మాట అనడం ఆలిశ్యం టక్కున పోయి రిషా తీసకొచ్చేశాను.

మా అమ్మ యింకో దుప్పటిని రిక్షా ఆయనకిచ్చి, 'య్యో! టాపేసి దుప్పటి కట్టు' అనింది. (మా ఊర్లో ఉండేది బెజవాడ తట్టుండే పెద్ద రిక్షాలు. మా ఆడోళ్లు రిక్షా ప్రయాణం చేయాలంటే తప్పనిసరిగా టాపేసి దుప్పటి కట్టాల్సిందే).

రిక్షా ఆయన దుప్పటి కట్టినాక సీట్లో మా అమ్మా జైబూన్ఆపా, తొట్లో నేనూ కూచున్నాం. ఆట బిగిను పెట్టే టయానికి మా రిక్షా హాలు ముందర ఆగింది.

'రే... గబాల్న పోయి నేల టికెట్టు తీసుకొని కూచోబో' అని ముక్కాలు రూపాయి నా చేతిలో పెట్టింది మా అమ్మ.

నేను పరిగెడతా ఉంటే 'ఇంటర్‌బెల్లో వచ్చేసేయ్ రే' అని కేకబెట్టింది.

ఆ మాట నాకూ మా అమ్మకూ తప్ప యింకొకరికి అర్థం కాదు. అంటే అది మా యిద్దరి మద్య అండర్ స్టాండింగు. మేము ఎప్పుడు సినిమాకి వచ్చినా (మా అన్నను పిలచక వచ్చినా) పిలకాయలు నేలకి. పెద్దోళ్లు బెంచీకి.

సినిమా బిగినుపెట్టి, గేటు కాడుండే మనుషులు పక్కకు పొయ్యేంత వరకే ఈ నేలా బెంచీ ఆట. వాళ్లట్ట తప్పుకోంగానే మేము నేలలో నుంచి బెంచీలోకి దూకి మా అమ్మ పక్కన చేరిపోతాం- దర్జాగా.

ఆ రోజు కూడా గేట్ల కాడుండే మనుషులు లైట్లాపుచేసి వెళ్లిపోయినాక, యింటర్‌బెల్లుకు ముందే సైగ్గా లేచి కిటకిటలాడతా వున్న బెంచీలోకి దూకినాను.

అంతా చీకటి.

దోవ కనపడక అటూ ఇటూ తడముకుంటా ఉంటే 'ఈడ్రో.. యిడా' అంటా పిలిచి నా చెయ్యి పట్టుకొని పక్కనున్న సీట్లో కూచోపెట్టుకునింది మా అమ్మ.

నేను కూచున్నాక నా పక్కనున్న ఒక ఆడమనిషి నా తట్టు మా అమ్మ తట్టు పైకీ కిందికీ చూసింది.

'మనిషుండాడు... మనిషుండాడు అంటా ఉన్న ఒక్క సీటులో మా ఆడబిడ్డని కూచోనీకుండా చేసినావు.. నేల్లో నుంచి దూకిన ఈ బుడ్డపీసేనంటమ్మా మనిషా?' అనింది తుస్కారంగా.

మా అమ్మ ఆ మాటల్ని యినిపించుకోనేలా. నేనయితే అసలా దిక్కుకే చూళ్లా!

